స్నేహితులక్కి తమ 'గిఫ్ట్'లను చూపడానికి తూనీగల్లే బయటికి పరిగెత్తారు పిల్లలు.

''ఆ వంకాయలిలా తే, నేను తరిగిస్తాను. కొత్తిమీర కారం పెట్టి వండు'' అని పురమాయిస్తూ...

''నేను నేర్పించిన వంటల్ని మీ వాళ్లకి రుచి చూపిస్తున్నావా లేదా 'గ్రానీ'గా వాటినీ ఖూనీ చేశావా'' అంటూ కత్తిపీటను దగ్గరకు లాక్కుంటున్న సుశీలమ్మను చూసి తల దించుకుని ''అది కాదు పిన్నీ...'' అంటూ కళ్లు తుడుచుకుంది ఉమ.

''పిచ్చి తల్లీ'' అంటూ ఆప్యాయంగా అక్కున చేర్చుకున్న సుశీలమ్మ, ''మన వాళ్లందరిలోకి నువ్వు అదృష్టవంతురాలివని మీ పెళ్లి విషయం తెలిసిన నాడే అనిపించింది నాకు. సొంత వ్యవసాయం, పాడి, పార్వతీ పరమేశ్వరులు లాంటి అత్తమామలు, దైవం లాంటి భర్త, ముత్యాల్లాంటి పిల్లలు... కల్తీ లేని మమకారాల మధ్య ఉన్న నిన్ను చూసి సంతోషిద్దామని మేము వస్తే... అమెరికా ఏదో అందలం అని అక్కడి నుంచి వస్తే మారిపోయి ఉంటామనుకున్నావా అమ్మడూ! అమెరికా వెళ్లినా ఆవకాయ మరచిపోతామటే? కాల, మాన, వ్యవహారాల ప్రకారం అక్కడ జీవనం వేరు, ఇక్కడ జీవనం వేరు. ఒకటి ఎక్కువ కాదు, మరోటి తక్కువా కాదు. నీకో తమాషా చెప్పనా? అక్కడ చాలామందికి మన కంటే కూడా ఎక్కువగా మన సంప్రదాయం, సంస్కృతి అంటే తగని గౌరవం, మక్కువ''

'అవునా'' అంటూ ఆశ్చర్యంగా చూస్తున్న ఉమతో

''అత్తగారింట్లో అందరి ఆదరణ పొందుతూ పుట్టింటికి పేరు తెస్తేనే మా అమ్మాయివి'' అంటూ ఉమ తల నిమురుతున్న సుశీలమ్మ తన రాకను గుర్తు చేస్తూ పొడి దగ్గు దగ్గుతున్న అల్లుడి గార్ని చూసి కొంగు సవరించుకున్నారు.

''మరేం లేదు సాంబారులోకి ములక్కాయలు కావాలా? సూప్‌లోకి మొక్కజొన్న పిండి కావాలా అని...'' కొంటెగా అంటున్న భర్తను ఉరిమి చూడబోయి, చేతకాక ఫకాలుమని నవ్వింది ఉమ.

భోజనాల గది నుండి తెరలు తెరలుగా వినబడుతున్న నవ్వుల హోరుకి ''ఏంటో ఈ అమెరికా వోళ్లు ఎక్కిళ్లొస్తే మరి నీళ్లైనా తాగుతారో లేదో?'' బావిలో చేద వేస్తూ అనుకుంది రామి.

**- వి. విజయలక్ష్మి శర్మ (ఉప్పల్)**

# తగిన శాస్తి

**సమయం సాయంత్రం అయిదు గంటలు కావస్తోంది. అక్కడ హెడ్ కానిస్టేబుల్ ఆధ్వర్యంలో లైసెన్సులు చెకింగు జరుగుతోంది.**

అటుగా స్కూటరుపై వస్తున్న జగదీశ్‌ను కానిస్టేబుల్ ఆపాడు.

''డ్రయివింగ్ లైసెన్స్ చూపించు'' అన్నాడు కానిస్టేబుల్ వీరాస్వామి.

జగదీశ్ డిక్కీ వెదికి చూసి ''లేవు సార్! ఇంటి దగ్గర మరచిపోయాను'' బ్రతిమలాడుతూ అన్నాడు.

''అందరూ ఇలాగే చెబుతారు. బండి పక్కకు తీసి తాళం నాకు తాళం ఇవ్వు'' హుంకరించాడు కానిస్టేబుల్.

''సార్! మా అమ్మకు డాక్టరు రాసిన ఇంజక్షన్‌లు, టాబ్లెట్స్ పట్టుకెళ్తున్నాను'' ప్రాధేయ పడుతూ అడిగాడు జగదీశ్.

''వంద రూపాయలు ఇచ్చి నీ స్కూటరు పట్టుకెళ్లు'' తనదైన శైలిలో అన్నాడు కానిస్టేబుల్ వీరాస్వామి.

కానిస్టేబుల్ చేతిలో వంద రూపాయల నోటు పెట్టి స్కూటరు పట్టుకెళ్లిపోయాడు జగదీశ్.

కానిస్టేబుల్ వీరాస్వామి తన సంపాదనతో ఒక కేజీ మాంసం, ఆఫ్ బాటిల్ బ్రాందీ పట్టుకొని హుషారుగా ఇంటికెళ్లాడు.



ఇంటి బయట గుమ్మం దగ్గర భార్య దీనంగా కనిపించింది వీరాస్వామికి.

''ఏంటి కాంతం అలా ఉన్నావు?'' భార్యను అడిగాడు కానిస్టేబుల్ వీరాస్వామి.

''ఏం చెప్పమంటారండి. మీరు చీర కోసం ఇచ్చిన అయిదు వందల రూపాయలు ఆ కానిస్టేబుల్ ముఖాన్న కొట్టవలసి వచ్చింది'' తుడుచుకుంటూ చెప్పింది కాంతం.

''ఏంటి అర్థమయ్యేటట్టు చెప్పు'' అన్నాడు వీరాస్వామి.

''మన అబ్బాయి పక్కింటి రాజారావుగారి స్కూటరు పట్టుకొని అలా రోడ్డు మీదకు వెళ్లాడండి. ఎవరో కానిస్టేబుల్ పట్టుకొని డ్రైవింగ్ లైసెన్స్ అడిగాడట. లేదని చెప్పేసరికి అయిదు వందల రూపాయలు ఇచ్చి స్కూటరు పట్టుకెళ్లమన్నాడట. అంతవరకు స్కూటరు అక్కడే ఉంచేడట. అబ్బాయి ఇంటికొచ్చి అయిదు వందలు పట్టుకెళ్లి స్కూటరు పట్టుకొచ్చాడు'' చెప్పింది కాంతం.

చేతిలో మాంసానికి, జేబులో బ్రాందీ సీసాకి వీళ్ల మాటలు అర్థం కాలేదు.

కానిస్టేబుల్ వీరాస్వామికి మాత్రం అంత చలిలోను ముఖమంతా చెమటతో నిండిపోయింది.

**-వైద్యా ఈశ్వరరావు**
(విశాఖపట్నం)